క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణ పుష్పార్చన



ప్రత్యేకాలంకరణలో కొలువైన పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీపైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన చేశారు. వేకువజామున అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు సాయికిరణ్, అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవ చేశారు. భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈవో కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



విజయనగరం టౌన్: స్థానిక పెద్దచెరువు గట్టు ఆనుకుని ఉన్న శ్రీవిజయసాగర దుర్గా మల్లేశ్వరి ఆలయంలో కొలువైన దుర్గమ్మ శుక్రవారం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ ప్రత్యేకాలంకరణలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆషాఢమాసంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించడం ఆనవాయితీగా వస్తుండడం గమనార్హం.

మహిళల రక్షణ కోసమే 'వన్‌స్టాప్'



విద్యార్థులకు వన్‌స్టాప్ సెంటర్ సేవలను వివరిస్తున్న ఎస్‌ఐ శిరీష

విజయనగరం ఫోర్ట్: మహిళల రక్షణ కోసమే వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు చేయడం, పనిచేయడం జరుగుతోందని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శిరీష అన్నారు. నగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై, సెంటర్ సేవలను వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు వన్‌స్టాప్ సెంటర్ సేవల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలని తెలిపారు. తొలుత సెంటర్‌లో బాధితురాలి సమస్యను విని, అవసరాన్ని గుర్తించి సాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ పోలీస్ ప్రొహిబిషన్ ఆఫీసర్ శోభారాణి, కౌన్సిలర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రజారోగ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సాంకేతిక ప్రణాళికలను అవలంబించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై నగరంలోని తన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన సాంకేతికపరమైన అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రతిరోజూ జరిపే ఇంటింటి చెత్త సేకరణలో లోపాలు లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరుబయట చెత్త వేయకుండా ఇళ్ల సముదాయాలు, వాణిజ్య సముదాయాలలో అవగాహన కల్పించాలన్నారు. కేటాయించిన అన్ని గృహాల వద్దకు సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరు కావాలన్నారు. ఈ విషయంలో పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. హేతుబద్ధమైన రూట్ మ్యాపింగ్ ద్వారా ఇప్పటికే ఉన్న పారిశుధ్య సిబ్బందితో పాటు వాహనాల వినియోగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులలో తడి, పొడి చెత్త పట్ల అవగాహన తీసుకురావాలన్నారు. పారిశుధ్యంపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి, అవసరమైన చోట పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో?

- కొత్త పెన్షన్ల ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- దరఖాస్తు చేద్దామన్నా తెరుచుకోని వెబ్‌సైట్
- అర్హులకు తప్పని ఎదురుచూపులు
- త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి





పూసపాటిరేగ: కొత్తగా పింఛన్ల కోసం చూస్తున్న వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఇంతవరకు కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడ లేదు. దీంతో అర్హులైన వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే అదే నెలలో స్పౌజ్ కోటాలో ఆయన భార్యకు పింఛన్ మంజూరు చేయడం జరిగేది. ఇప్పుడు ఆ స్పౌజ్ కోటాలోని వారికి కూడా దిక్కు లేదు. ఇంటి పెద్దను కోల్పోయి బాధపడుతున్న తమకు పింఛన్ కూడా అందివ్వకపోవడం ఆర్థికంగా మరింత ఇబ్బంది తెచ్చిపెడుతోందని పలువురు మహిళలు(వితంతువులు) వాపోతున్నారు.

గతంలో పార్టీలకతీతంగా..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పింఛన్లు అందించేవారు. అర్హులకు దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజుల వ్యవధిలోనే అర్హతలు పరిశీలించి, పింఛన్ మంజూరు చేసేవారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి వారి పార్టీ కార్యకర్త కాదా అనే విషయం ఆలోచించి, ఇవ్వడం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గంలో 2,600 మంది అర్హులు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 వేల మంది పింఛన్లకు అర్హులు కాగా ఒక్క నెల్లిమర్ల నియోజకవర్గంలోనే 2,600 మంది పింఛన్ల కోసం వేచి చూస్తున్నారని సమాచారం. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లోని అర్హులంతా ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా పూసపాటిరేగలో భర్త చనిపోయి ఏడాది దాటుతున్నా పెన్షన్ ఇవ్వలేదని పిల్ల బుచ్చమ్మ, బెల్లాన రాములమ్మ, జలమాదుల సరస్వతిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కుమిలి గ్రామంలోని కోండ్ర లక్ష్మి, ఉప్పాడ అసిరమ్మ, బూర్లె అప్పయ్యమ్మ, పొట్నూరు రమణమ్మలు.. కొత్త పెన్షన్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నామని అంటున్నారు.

పింఛన్ల కోతకు సర్వేలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లలో కోత విధించేందుకు సర్వేలు చేయిస్తోంది. కుల, మత, రాజకీయ పార్టీలు చూస్తూ అనర్హుల పేరిట పింఛన్లు తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఏ నాయకుడు అయినా ఈ పింఛన్ మన పార్టీ వ్యక్తిది కాదని చెబితే చాలు తీసేయడానికి సిద్ధమైపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న కొంత మంది ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ సొమ్ము కోసం చూస్తుంటే వారికి ఎదురుచూపులు తప్ప ఫలితం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కొత్త పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అర్హులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పింఛన్ మంజూరైనా ఇవ్వడం లేదు..



నా భర్త చనిపోయి రెండేళ్లు అయింది. ఇంతవరకు పింఛన్ మంజూరు కాలేదు. నెలరోజుల క్రితం స్పౌజ్ కోటాలో పెన్షన్ మంజూరైందని సచివాలయం నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ నెల ఒకటో తేదీన పింఛన్ ఇస్తారని ఆశగా ఎదురుచూశాను. అయినా ఇవ్వలేదు. నేను గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నా. పింఛన్ డబ్బులు వస్తే కనీసం మందుల ఖర్చుకైనా వస్తాయని అనుకుంటున్నా.

–జలమాదిల సరస్వతి, భూడి వీధి, పూసపాటిరేగ

కాళ్లరిగేలా తిరుగుతున్నాం..



నా భర్త మరణించి ఏడాది దాటింది. అయినా ఇంతవరకు పింఛన్ మంజూరు చేయలేదు. కనిపించిన అధికారులు, ప్రజాప్రతినిధులను పదేపదే అడుగుతున్నా ఎవరూ సరిగా స్పందించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదు. ఎప్పుడిస్తే అప్పుడే అనుకునేలా పరిస్థితిని తీసుకువచ్చారు. ఇప్పటికైనా త్వరగా పెన్షన్ ఇవ్వాలి.

–బెల్లాన రాములమ్మ, రాజావీధి, పూసపాటిరేగ

ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు..



నా భర్త గతేడాది జూన్‌లో చనిపోయారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పింఛన్ కోసం గ్రామానికి వచ్చిన ప్రతి అధికారిని, ప్రతి ప్రజాప్రతినిధిని వేడుకుంటున్నా. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నా పింఛన్ వచ్చేలా చూడాలి. కూటమి నేతలైనా చొరవ తీసుకుని పెన్షన్లు మంజూరు కోసం ప్రయత్నించాలి.

–పిల్ల బుచ్చమ్మ, బూడి వీధి, పూసపాటిరేగ

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ





అమ్మవారికి సారె పట్టుకువెళ్తున్న భక్తులు, ఇన్‌సెట్‌లో సమర్పించిన సారె

భోగాపురం: స్థానిక శ్రీకనకదుర్గమ్మకు గ్రామానికి చెందిన భక్తులు ఆషాఢం సారె శుక్రవారం సమర్పించారు. పసుపు, కుంకుమలతో పాటు తొమ్మిది రకాల స్వీట్లు, పండ్లను బొండి వీధిలోని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి సారె అందజేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



పొదుపు సంఘాల రుణం చెక్కు అందజేస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు

విజయనగరం అర్బన్: నగరంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఔట్ రీచ్ ప్రోగ్రాం–2025 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు జనరల్ మేనేజర్ సుమేష్‌కుమార్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ప్రతినిధులంతా అగ్రికల్చల్ రుణాలు, సర్వీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆ కార్యక్రమానికి సంబంధించిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. ఆ తర్వాత అర్హులకు ఇన్ ప్రిన్సిపల్ సాంక్షన్ లెటర్లు, చెక్కులను సర్కిల్ హెడ్ ఆనంద్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వైజాగ్ డీజీఎం ఆనంద్‌కుమార్, విజయనగరం బ్రాంచ్ హెడ్ ధర్మారెడ్డి అరుణ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల్లో ప్రతిరోజూ క్లోరినేషన్ చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో మల్లికార్జునరావు

డెంకాడ: తాగునీటి ట్యాంకుల్లో ప్రతిరోజూ క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని చింతలవలస గ్రామంలో జిల్లా కో–ఆర్డినేటర్ బీఎస్ఆర్ పట్నాయక్‌తో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన.. గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, రక్షిత మంచినీటి ట్యాంకులను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసే ఫొటోలను పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, క్లస్టర్ కో–ఆర్డినేటర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో జీవనరాణి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద ప్రపంచ జనాభా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలు, జనాభా తగ్గుదల వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు చిన్న కుటుంబాల ఆవశ్యకతను వివరించారు. అలాగే కుటుంబ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. మొదటి బిడ్డకు రెండో బిడ్డకు కొన్ని సంవత్సరాలు గ్యాప్ ఉండేలా చూసుకోవాలని, లేకుంటే ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇదే విషయంపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డీఐవో అచ్చుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ, డీఎస్‌వో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, విజయనగరం కంటోన్మెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు ఈ నెల 9వ తేదీన డైట్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను శుక్రవారం కళాశాలలో అందజేశారు. డ్రాయింగ్ పోటీల్లో ఎం.గౌతమ్ (దేవాడ), పి.కార్తీక(భోగాపురం మోడల్ స్కూల్), ఎస్.గీతామాధురి (రామచంద్రపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా, వ్యాసరచన పోటీల్లో వి.చరిష్మా(చీపురుపల్లి గురుకులం), జి.వర్షిత (భోగాపురం మోడల్ స్కూల్), ఎం.కోమలి(కొండపాలెం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి డైట్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, స్టాఫ్ సెక్రటరీ చిన్నం నాయుడు, అధ్యాపకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలైన విద్యార్థులతో డైట్ అధ్యాపకులు

చంద్రబాబుది దగాకోరు పాలన

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



తమ్మాపురంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

నెల్లిమర్ల: పాలిచ్చిన ఆవును వదిలేసి దున్నపోతును తెచ్చుకున్న చందంగా ప్రజల పరిస్థితి తయారైందని, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలేవీ అమలు చేయకపోవడంతో ప్రజలే బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరిట మండలంలోని మల్యాడ, ఒమ్మి, సతివాడ, తమ్మాపురం, తంగుడుబిల్లి గ్రామాల్లో రచ్చబండ సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో తొలుత ఇంటింటికీ వెళ్లిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులంతా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్న తీరును వివరించారు. చంద్రబాబుది దగాకోరు పాలన అని, అధికారంలోకి వచ్చిన మొదటి నుంచి రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలే జరుగుతున్నాయని, ప్రజలకు చేసే మంచి ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి సర్కారు వహిస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అన్ని హామీలు అమలు చేసేస్తున్నామని గొప్పలు తప్ప ఇప్పటివరకు ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికే చాలామందికి గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం పథకం అందలేదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అయితే అర్హులకు తక్షణమే పథకం అందేదన్నారు. ఇదే మాట ఏ ఊరెళ్లినా చెబుతున్నారన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి గారడీ మాటలను నమ్మి నియోజకవర్గ ప్రజలు మోసపోయారన్నారు. ఎన్నికలకు ముందు ప్లాస్టిక్ డొక్కులు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టారని, వందలాది కంపెనీలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగాలిప్పిస్తామన్నారని, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మాత్రమే కాదని ఎప్పుడూ జనంలోనే ఉండాలని తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని, అందుకే ప్రజలను ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో వివరించడానికి వచ్చామన్నారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన మంచి ఏమీ లేదని, ఇప్పటికైనా కుట్రపూరిత, డైవర్షన్ పాలిటిక్స్ మాని, జనానికి మేలు చేసే పాలన చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, పార్టీ సీనియర్ నేతలు మత్స సత్యనారాయణ, దంతులూరి గిరిబాబు, సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, పతివాడ సత్యనారాయణ, అంబళ్ల కిరణ్, పప్పల బలరాం, రేవళ్ల శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, తర్లాడ దుర్గారావు, పంచాది శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఒమ్మిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

21 మద్యంసీసాల స్వాధీనం

విజయనగరం క్రైమ్: మండలంలోని జమ్ములో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడి వద్ద నుంచి 11 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి నుంచి కూడా మరో 10 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తులిద్దరూ అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఆకస్మిక తనిఖీలు చేసి, మద్యం పట్టుకున్నామని పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో తుది మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: నగర పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలకు సంబంధించి ఐదు కేటగిరీల పోస్టులకు సంబంధించి, తుది మెరిట్ జాబితాను విజయనగరం.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల శుక్రవారం తెలిపారు. ఓటీ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండెంట్, ఎలక్ట్రికల్ హెల్పర్, స్టోర్ అటెండెంట్ పోస్టుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయండి



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దారు శ్రీకాంత్

విజయనగరం: ఓటుహక్కు పొందేందుకు అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య బీఎల్‌వోలను ఆదేశించారు. ఇదే విషయమై నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో బీఎల్‌వోలకు ఇస్తున్న శిక్షణకు శుక్రవారం హాజరై, పలు సూచనలు చేశారు. ఇప్పటికే నియమించిన బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ కనీసంగా 1200 నుంచి 1400 మంది వరకు ఓటర్లను చేర్చాలన్నారు. పాత ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, మృతి చెందిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించాలని, అలాగే ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లను జాబితాలో చేర్చుకోవడం, ఫారం 6ఏ ప్రకారం విదేశాల్లోని ఓటర్లను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఫారం 8 ద్వారా ఓటరు మారిన అసెంబ్లీ స్థానం వివరాలను నమోదు చేసుకోవడం వంటి ప్రక్రియలను చేపట్టాలన్నారు. త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా, పారదర్శకంగా చేపట్టాలన్నారు. శతశాతం ఓటరు జాబితా రూపకల్పన పక్కాగా జరగాలన్నారు.

నెల్లిమర్ల: కచ్చితమైన ఓటరు జాబితా తయారీకి బూత్ లెవెల్ అధికారు(బీఎల్‌వో)లు అంకితభావంతో పనిచేయాలని నెల్లిమర్ల నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, తహసీల్దారు కె.శ్రీకాంత్ సూచించారు. ఐదు రోజుల పాటు జరగనున్న బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమంలో భాగంగా స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో రెండో రోజు శిక్షణను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పక్కా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. చేర్పులు, మార్పులపై దృష్టి సారించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి యువతీ, యువకులకు అవగాహన కల్పించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. రాబోయే ఎన్నికలను సక్రమంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ నాయకుల సహకారం తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను అన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పీఎస్ పరిధిలోని రాజకీయ ప్రతినిధులు సలహాలతో తగిన నివేదిక ఇవ్వాలన్నారు. 6,7,8 ఫారం విచారణ నివేదికను క్షుణ్ణంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వీవీఆర్ జగన్నాథరావు, సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు పాల్గొన్నారు.